నమస్తే తెలంగాణ
మంచిర్యాల
కుమ్రం భీం ఆసిఫాబాద్
5 | గురువారం 17 అక్టోబర్ 2024 | MANCHERIAL KUMURAM BHEEM ASIFABAD

గోండు బెబ్బులి కుమ్రం భీం

నిజాం సర్కారుపై తిరగబడ్డ అడవి బిడ్డ

- 'జల్, జంగల్, జమీన్' నినాదంతో పోరాటం
- ఆ మహనీయుడి పోరాట ఫలితంగానే ఆదివాసీలకు హక్కులు
- నేడు కుమ్రం భీం వర్ధంతి
- జోడేఘాట్‌లో ఏర్పాట్లు పూర్తి

అప్పటికి ఇంకా దేశానికి స్వాతంత్ర్యం రాలేదు. బ్రిటిష్ తెల్లదొరలు, నిజాం నవాబులు పాలిస్తున్న రోజులవి. 1935లో జనగాం(ఆసిఫాబాద్) జిల్లా కేంద్రంగా ఉన్నప్పుడు అడవులను నమ్ముకొని జీవిస్తున్న ఆదివాసీలపై నిజాం సర్కార్ పాశవిక చర్యలకు పాల్పడింది. 'జల్, జంగల్, జమీన్' నినాదంతో నిజాం సర్కారుపై భీకరంగా పోరాడి వీర మరణం పొంది ఆదివాసుల గుండెల్లో కుమ్రం భీం చిరస్థాయిగా నిలిచిపోయాడు. ఆ మహనీయుడు త్యాగాల ఫలితంగా ఆదివాసీలకు హక్కులు సిద్ధించాయి. నేడు ఆదివాసీ ముద్దు బిడ్డ..గోండు బెబ్బులి కుమ్రం భీం 84వ వర్ధంతి సందర్భంగా కథనం.

కుమ్రం భీం ఆసిఫాబాద్(నమస్తే తెలంగాణ)/కెరమెరి, అక్టోబర్ 16: ఆసిఫాబాద్ మండలం సంకెపల్లిలో గోండు తెగకు చెందిన కుమ్రం చిన్నూ దంపతులకు 1901సంవత్సరంలో కుమ్రం భీం జన్మించాడు. భూ పట్టాదారులు, అటవీ సిబ్బంది చిత్రహింసలతో గ్రామస్తులతో పాటు భీం కుటుంబం కూడా ఇబ్బందులు పడ్డది. ఈ క్రమంలో భీం తండ్రి చిన్నూ మరణించడంతో ఆ కుటుంబం కెరమెరి మండలం సుర్దాపూర్‌కు వలస వచ్చింది. అడవిని నరికి పోడు వ్యవసాయం ప్రారంభించారు. పంట చేతికి వచ్చే తరుణంలో సిద్దిఖ్ అనే పట్టాదారుడు వచ్చి భూమి తనదేనంటూ ఆదివాసులు పండించిన పంటలు తనకే దక్కాలంటూ భయభ్రాంతులకు గురిచేశాడు. అతని అరాచకాలు భరించలేని ఆదివాసీలు తిరుగుబాటుకు సిద్ధమయ్యారు. వేధింపులను భరించలేక భీం కర్రతో దాడి చేయగా సిద్దిఖ్ అక్కడికక్కడే హతమయ్యాడు. నిజాం పోలీసులు భీంపై హత్య నేరం మోపగా భీం బాల్య స్నేహితుడు కొండల్‌తో బల్లార్షా, చంద్రాపూర్ వైపు పయనమయ్యాడు. అక్కడి నుంచి అస్సాం వెళ్లి తేయాకు తోటలో పని చేశాడు. రాంజీగోండు, అల్లూరిసీతారామారాజుల పోరాటాన్ని ఆదర్శంగా తీసుకుని సుర్దాపూర్‌కు తిరిగి వచ్చాడు. బాబేఝరిలో పోడు వ్యవసాయం ప్రారంభించాడు. నిజాం పోలీసులు అటవీ సిబ్బంది అక్కడికి వెళ్లగా భీం వారిపై ఎదురు తిరిగి పంపించాడు. బాబేఝరి భూసమస్య నిజాం ప్రభుత్వానికి, భీం మధ్య వివాదంగా మారి యుద్ధానికి దారితీసింది. జోడేఘాట్ కేంద్రంగా చుట్టుపక్కల 12 గ్రామాల ఆదివాసులను భీం ఏకం చేశాడు. గెరిల్లా తరహా పోరాటాలకు వారిని సిద్ధం చేశాడు. 'జల్, జంగల్, జమీన్' నినాదంతో పోరాటానికి భీం నాంది పలికారు. నిజాం ప్రభుత్వం అప్పటి ఆసిఫాబాద్ కలెక్టర్‌ను రాయబారానికి జోడేఘాట్‌కు పంపింది. 12 గ్రామాలకు స్వాతంత్ర్యం ప్రకటించాలని జైలులోని తన అనుచరులను విడిలిపెట్టాలని భీం షరతులు విధించాడు. దీనికి అంగీకరించని నిజాం సర్కార్ సైన్యాన్ని దింపింది. ఓ ద్రోహి ఇచ్చిన సమాచారంతో జోడేఘాట్‌కు అర్ధరాత్రి చేరుకొని నిద్రిస్తున్న భీం అనుచరులపై ఏకపక్షంగా కాల్పులకు పాల్పడింది. భీం సేన పోరాటానికి దిగగా చివరికి నిజాం పోలీసుల తూటాలకు 1940 ఆశ్వీయుజ మాసం పౌర్ణమి రోజున కుమ్రం భీం వీరమరణం పొందాడు. అనంతరం ఆదివాసీల సమస్యలు, జీవనస్థితిని పరిశోధనకు నిజాం ప్రభుత్వం ఇంగ్లాండ్‌కు చెందిన సామాజిక శాస్త్రవేత్త ప్రొఫెసర్ హేమన్‌డార్ఫ్‌ను నియమించింది. దీంతో ఆయన తన సతీమణి ఎలిజబెత్‌తో ఆదివాసుల మధ్య నివాసముంటూ నివేదికను ప్రభుత్వానికి పంపించారు. ఆ నివేదికకు స్పందించిన అప్పటి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆదివాసీలు సాగుచేస్తున్న భూములకు పట్టాలు ఇచ్చి ప్రత్యేక రిజర్వేషన్ సౌకర్యం, హక్కులు కల్పించాయి.

దర్బార్ కోసం ఏర్పాటు చేసిన వేదిక

జోడేఘాట్‌లో వర్ధంతికి ఏర్పాట్లు పూర్తి

జోడేఘాట్‌లో కుమ్రం భీం వర్ధంతి వేడుకలకు భీం విగ్రహం, సమాధిని అలంకరించారు. దర్బార్ కోసం వేదిక, ప్రజల కోసం టెంట్లు, తాగునీరు, భోజన వసతి, వాహనాల పార్కింగ్ ఏర్పాటు చేశారు. హెలీ ప్యాడ్ నుంచి భీమ్ స్మృతి చిహ్నం, మ్యూజియం, సభ వేదిక వరకు బారికేడ్లు నిర్మించారు. జిల్లా కేంద్రంతో పాటు వివిధ ప్రాంతాల నుంచి ఆర్టీసీ బస్సులను ఏర్పాటు చేశారు. కార్యక్రమానికి పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క(ధనసరి అనసూయ), ఆసిఫాబాద్, ఖానాపూర్ ఎమ్మెల్యేలు కోవ లక్ష్మి, వెడ్మ బొజ్జు, జిల్లా కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే, ఉమ్మడి జిల్లా స్థాయి అధికారులు, ప్రజాప్రతినిధులు, రాజకీయ పార్టీల నాయకులు హాజరుకానున్నారని ఉత్సవ కమిటీ చైర్మన్ రాజేశ్వర్ తెలిపారు. ముగ్గురు డీఎస్పీలు, 15 సీఐలు, 28మంది ఎస్ఐలు, 460 మంది పోలీసులతో బందోబస్తు నిర్వహిస్తున్నట్లు ఎస్పీ శ్రీనివాసరావు తెలిపారు. జోడేఘాట్‌లో సంప్రదాయబద్ధంగా బుధవారం రాత్రి భీం వారసులు, ఆదివాసీలు ఊరేగింపుగా తరలివచ్చి, భీం స్మృతి చిహ్నం చుట్టూ ప్రదక్షిణలు చేశారు. అనంతరం కుమ్రం భీం మనుమడు సోనేరావ్ ఆధ్వర్యంలో అవ్వల్ పేన్ వద్ద పూజలు చేశారు.

నెన్నెలలో వరి పొలాన్ని పరిశీలిస్తున్న వ్యవసాయ అధికారులు

వరి క్షేత్రాల పరిశీలన

'నమస్తే'కు స్పందన

నెన్నెల, అక్టోబర్ 16 : నెన్నెల మండలంలో నాసిరకం వరి విత్తనాలు వేసి పంట సరిగా రాకపోవడంపై నమస్తే తెలంగాణలో 'నాసిరకం..నష్ట భయం' అనే కథనానికి నెన్నెల మండల వ్యవసాయ అధికారిని గాదర్ల కిరణ్మయి, ఏఈవో రాంచందర్ స్పందించారు. బుధవారం వరి చేలను పరిశీలించారు. విత్తనాలు సరఫరా చేసిన డీలర్లతో పాటు కంపెనీకి చెందిన సిబ్బందిని ప్రశ్నించారు. రైతులు వేసిన వరి విత్తనాలు పంట కాలం కంటే ముందుగానే పొట్టకు వచ్చి ఈనడం, మిగతా పిలకలు పొట్ట దశకు కూడా రాకపోవడం గమనించారు. దీంతో రైతులు 20 శాతం మేర పంట నష్టం పోయే అవకాశాలు ఉన్నట్లు గుర్తించారు. సంబంధిత విక్రయదారులు కంపెనీ డిస్ట్రిబ్యూటర్లు వచ్చి రైతుల పొలాలను పరిశీలించి పంట తీరును అంచనా వేయాలని ఏవో వారిని ఆదేశించారు. రైతులకు తగిన న్యాయం చేయకపోతే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

స్కాలర్‌షిప్‌లు మహాప్రభో..

డిగ్రీ కళాశాలల యాజమాన్యాలు, విద్యార్థుల నిరసన

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో రూ.232 కోట్లు పెండింగ్

ఆసిఫాబాద్‌లో ర్యాలీ తీస్తున్న డిగ్రీ కళాశాలల యజమానులు, అధ్యాపకులు, విద్యార్థులు

మంచిర్యాలలో ర్యాలీ తీస్తున్న ప్రైవేట్ కళాశాలల యజమానులు, విద్యార్థులు

మంచిర్యాల, అక్టోబర్ 16(నమస్తే తెలంగాణ ప్రతినిధి) : ప్రైవేటు డిగ్రీ కాలేజీలు, విద్యార్థులకు ఇవ్వాల్సిన స్కాలర్‌షిప్‌లు పెండింగ్ పడ్డాయి. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోనే 78 ప్రైవేటు డిగ్రీ కాలేజీలకు రూ.232 కోట్లు రావాల్సి ఉంది. రాష్ట్ర వ్యాప్తంగా గడిచిన మూడేళ్లలో ఏడు వేల కోట్ల రూపాయలు ఇలా పెండింగ్ పడ్డాయి. కేసీఆర్ ప్రభుత్వం ఉన్నప్పుడు స్కాలర్‌షిప్‌లు విడుదల చేసింది. కాంగ్రెస్ సర్కారు మాత్రం ఈ విషయంలో విఫలమైందని ప్రైవేటు కాలేజీల యాజమానులు, విద్యార్థి సంఘాల నాయకులు, విద్యార్థులు మండిపడుతున్నారు. తెలంగాణ వచ్చిన పదేళ్లలో ఎప్పుడూ కూడా స్కాలర్‌షిప్‌ల కోసం రోడ్ల మీదకు వచ్చి ర్యాలీలు, ధర్నాలు చేయలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. కానీ.. ఇప్పుడు కాలేజీలు నడిపే పరిస్థితి లేక రోడ్ల మీదకు వచ్చి నిరసన తెలపాల్సి వస్తుందని వాపోతున్నారు. తెలంగాణ ఉద్యమంలో రోడ్ల మీదకు వచ్చిన విద్యార్థులు ఇప్పుడు కాంగ్రెస్ సర్కారు పుణ్యమా అంటూ మరోసారి రోడ్ల మీదకు వచ్చి స్కాలర్‌షిప్‌ల కోసం నిరసన తెలపాల్సిన దుస్థితి దాపురించిందంటున్నారు. ప్రభుత్వం నుంచి స్పందన లేకపోవడంతోనే నిరసనలు, ఆందోళనలు చేపట్టాలని నిర్ణయానికి వచ్చినట్లు చెబుతున్నారు. అప్పులు చేసి, ఉన్న ఆస్తులు అమ్ముకుని ఉద్యోగులకు జీతాలు ఇచ్చామని, ఇప్పుడు అది కూడా ఇవ్వలేని పరిస్థితుల్లో ఉన్నామని చెప్తున్నారు. మంచిర్యాల జిల్లా కేంద్రంలో స్కాలర్‌షిప్‌లు విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ ప్రైవేటు డిగ్రీ కాలేజీల యాజమాన్యాలు, విద్యార్థి సంఘాలు, విద్యార్థులు భారీ ర్యాలీ నిర్వహించారు. ఆసిఫాబాద్ జిల్లాలోనే ఈ తరహా ర్యాలీ తీశారు. ఆదిలాబాద్‌లో యాజమాన్యాలు కలెక్టర్‌కు వినతి పత్రం అందజేశాయి. నిర్మల్ జిల్లాలో ప్రైవేటు డిగ్రీ కాలేజీల ఎదుట నిరసన దీక్షలు చేశారు. మూడు, నాలుగు రోజులుగా వివిధ రకాలుగా డిగ్రీ కాలేజీల యాజమాన్యాలు నిరసనలు తెలుపుతున్నా ఇప్పటివరకు ప్రభుత్వం నుంచి స్పందన కరువైంది.

ప్రైవేటు డిగ్రీ కాలేజీలకు రావాల్సిన స్కాలర్‌షిప్‌ల వివరాలు

జిల్లా	ప్రైవేటు డిగ్రీ కాలేజీలు	పెండింగ్ ఉన్న మొత్తం
ఆదిలాబాద్	22	రూ.102 కోట్లు
మంచిర్యాల	25	రూ.90 కోట్లు
నిర్మల్	23	రూ.25 కోట్లు
ఆసిఫాబాద్	08	రూ.15 కోట్లు

స్కాలర్‌షిప్‌లు వెంటనే విడుదల చేయాలి..

గత మూడు సంవత్సరాలుగా స్కాలర్‌షిప్‌లు విడుదల చేయకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. కళాశాల సిబ్బందికి వేతనాలు ఇవ్వలేని పరిస్థితి నెలకొన్నది. విద్యార్థులు కూడా ఇబ్బందులు పడుతున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం స్పందించి వెంటనే స్కాలర్‌షిప్‌లు విడుదల చేయాలి. లేదంటే ఆందోళనలు చేస్తాం.

- పెట్టం మల్లయ్య, ప్రిన్సిపాల్, వాగ్దేవి డిగ్రీ కాలేజీ, మంచిర్యాల

కళాశాలలను ఆదుకోవాలి..

పెండింగ్ స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్లు చెల్లించకపోవడంతో ఇబ్బంది పడుతున్నాం. ప్రభుత్వం వెంటనే విడుదల చేసి ప్రైవేట్ కళాశాలను ఆదుకోవాలి. విడుదల కాకపోవడంతో విద్యార్థులు, ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం స్పందించి వెంటనే విడుదల చేయాలి.

- బావురెడ్డి(డైరెక్టర్), సంపత్(ప్రిన్సిపాల్), చాణక్య కాలేజీ, మంచిర్యాల

ఆందోళనలు చేస్తాం..

ప్రభుత్వం వెంటనే స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్ మెంట్లను విడుదల చేయాలి. లేదంటే పెద్ద ఎత్తున ఆందోళనలు చేస్తాం. స్కాలర్‌షిప్‌లు, ఫీజురీయింబర్స్‌మెంట్లు విడుదల చేయకపోవడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వెంటనే విడుదల చేయాలి.

-జిమ్మిడి గోపాల్, విద్యార్థి సంఘం నాయకుడు

విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారు..

ప్రభుత్వం స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్లను వెంటనే విడుదల చేయాలి. నిరుపేద విద్యార్థులు , కళాశాలల యాజమాన్యాలు కూడా ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్పందించి వెంటనే వీటిని విడుదల చేయాలి. లేదంటే పెద్ద ఎత్తున ఆందోళనలు చేస్తాం.

- సన్నీగౌడ్, విద్యార్థి సంఘం నాయకుడు

ప్రభుత్వ భూమి ఉన్నట్లా? లేనట్లా?

అక్రమ వెంచర్ అని తెలిసీ చర్యలెందుకు తీసుకోవడం లేదు

- అధికారులు అడిగిన డాక్యుమెంట్లు ఇవ్వని యాజమానులు
- అయినా చర్యలు తీసుకోకుండా చోద్యం చూస్తున్న వైనం

ప్రభుత్వ భూమి కబ్జా చేసి ఏర్పాటు చేసినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న వెంచర్

మంచిర్యాల, అక్టోబర్ 16(నమస్తే తెలంగాణ ప్రతినిధి) : మంచిర్యాల జిల్లా హాజీపూర్ మండలంలోని ముల్కల్ల గ్రామ శివారులో 10 గుంటల ప్రభుత్వ భూమిని కబ్జా చేసి.. వెంచర్ ఏర్పాటు చేశారనే ఆరోపణలు గుప్పుమంటున్నాయి. దీనిపై అక్టోబర్ 5వ తేదీన 'నమస్తే తెలంగాణ' దినపత్రికలో 'ప్రభుత్వ భూమి స్వాహా' శీర్షికన కథనం ప్రచురితమైంది. సర్వే నంబర్ 169తో 2.13 గుంటల ప్రభుత్వ భూమిని కొనుగోలు చేసి, దాన్ని ఆనుకుని ఉన్న 10 గుంటల ప్రభుత్వ భూమిని కలిపేసుకుని వెంచర్ చేశారని విమర్శలకు కథనం అద్దం పట్టింది. ఈ వెంచర్‌కు ప్రభుత్వం నుంచి ఎలాంటి పరిష్వక్షన్లు తీసుకోలేదు. అయినప్పటికీ నోటీసులు ఇవ్వకుండా పంచాయతీ కార్యదర్శి నిర్లక్ష్యం ప్రదర్శించడాన్ని కథనంలో ప్రశ్నించింది. ఈ మేరకు అదే రోజున పంచాయతీ కార్యదర్శి 'అక్రమ వెంచర్ వేశారు. దీనికి తెలంగాణ పంచాయతీ రాజ్ చట్టాన్ని అనుసరించి లేఅవుట్‌కు దరఖాస్తు చేసుకోండి. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకునేందుకు సమర్పించండి. మీ వెంచర్‌లో ప్రభుత్వ భూమి ఉన్నట్లు తెలిసింది. దానిపై వివరణ ఇచ్చి అందుకు సంబంధించిన బాండ్ పత్రాలు ఏమైనా ఉంటే పంచాయతీలో సమర్పించండి. ఈ నోటీసు అందిన మూడు రోజుల్లో స్పందించాలి..' అని నోటీసులు జారీ చేశారు. ఇదీ జరిగి పది రోజులు గడిచినా ఇప్పటి వరకు ఆ వెంచర్ నిర్వాహకులు, భూమి యాజమానులు స్పందించలేదు. మూడు రోజుల్లో స్పందించాలని నోటీసులు ఇచ్చిన కార్యదర్శి వారి నుంచి ఎలాంటి రిప్లయ్ రాకపోయినా తదుపరి చర్యలు తీసుకోండా చోద్యం చూస్తుండడంపై స్థానికులు మండిపడుతున్నారు. వార్త వచ్చిందని నోటీసు ఇచ్చి చేతులు దులుపేసుకున్నారే తప్పా వెంచర్‌పై చర్యలు ఎందుకు తీసుకోలేదని ప్రశ్నిస్తున్నారు.

ప్రభుత్వ భూమిపై విచారణ

'నమస్తే తెలంగాణ'లో వచ్చిన కథనంతో ఈ వెంచర్‌లో ప్రభుత్వ భూమి ఉన్న విషయంపై హాజీపూర్ తహసీల్దార్ విచారణ చేసినట్లు తెలిసింది. ఈ క్రమంలో విక్రయించిన 2.13 గుంటల భూమిని సంబంధించి పట్టాతోపాటు ఇందులో కలుపుకున్నారని చెప్తున్న ప్రభుత్వ భూమికి సంబంధించి వివరాలతో తహసీల్దార్ ఆరా తీసినట్లు సమాచారం. ఈ క్రమంలో పక్కన రోడ్డుకు మూడున్నర గుంటల పట్టాభూమి ఇచ్చామని, దానికి బదులుగా ఇక్కడ ఆరు గుంటల ప్రభుత్వ భూమిని మాకు అధికారులు ఇచ్చారని యజమానులు చెప్పినట్లు తహసీల్దార్ చెబుతున్నారు. ఒకవేళ ప్రభుత్వం నిజంగానే భూమి ఇచ్చి ఉంటే అందుకు సంబంధించిన పత్రాలు చూపించండి అంటే మాత్రం అలాంటివి ఏమీ లేవని, అప్పుడున్న కలెక్టర్ నోటి మాటగా చెప్పారని వాళ్లు చెబుతున్నట్లు తెలిసింది. రోడ్డు కోసం కోల్పోయిన భూమి మూడున్నర గుంటలైతే.. కలెక్టర్ ఆరు గుంటలు ఎలా ఇచ్చారు. ఒకవేళ ఇస్తే పేపర్ లేకుండా నోటి మాటపై ఇచ్చింది ఎలా చెల్లుతుంది. అసలు కలెక్టర్ ఇచ్చారా? ఇవ్వలేదా? ఆరు గుంటలు ఇస్తే వెంచర్‌లో 10 గుంటలు ఎలా కలిసింది. అనే ప్రశ్నలకు మాత్రం సమాధానం దొరకడం లేదు. దీనిపై తహసీల్దార్‌ను వివరణ కోరగా ప్రభుత్వ భూమి ఉందా? లేదా? తెలుసుకునేందుకు సర్వే చేస్తామని చెప్పారు. ఆ సర్వేలోనైనా నిజానిజాలు బయటికి రావాలని స్థానికులు కోరుతున్నారు. ప్రభుత్వ భూమి ఉందా? లేదా? అన్నది పక్కన పెడితే అక్రమంగా ఏర్పాటు చేసిన వెంచర్‌పై పంచాయతీ అధికారులు వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

రైతు సమస్యల పరిష్కారానికి కృషి

బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు ఆర్ఎస్పీ ప్రవీణ్ కుమార్

అంకుసాపూర్‌లో రైతులతో మాట్లాడుతున్న ఆర్ఎస్పీ ప్రవీణ్‌కుమార్

కాగజ్‌నగర్, అక్టోబర్ 16: రైతుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు ఆర్ఎస్పీ ప్రవీణ్ కుమార్ అన్నారు. కాగజ్‌నగర్ మండలంలోని అంకుసాపూర్‌లో బుధవారం రైతులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. దశాబ్దాలుగా సాగు చేసుకుంటున్న భూముల విషయంలో అటవీ శాఖ అధికారులు ఇబ్బందులకు గురి చేస్తున్నారని రైతులు తెలిపారు. అధికారులతో మాట్లాడి సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని ఆర్ఎస్పీ ప్రవీణ్‌కుమార్ భరోసానిచ్చారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ సిర్పూర్ నియోజకవర్గం కన్వీనర్ లెండుగురే శ్యామ్‌రావు, కౌన్సిలర్ ఎండీ మిన్‌హాజ్, నాయకులు రాజ్ కుమార్ యాదవ్, నక్క మనోహర్, రామ్ ప్రసాద్, దేవాజీ, విఘ్నేశ్వర్ కార్యకర్తలు, నాయకులు గ్రామస్తులు పాల్గొన్నారు.

మత్తడి పేల్చివేతలో నిందితులను అరెస్ట్ చేయాలి

కలెక్టర్, సీపీలకు బీఆర్ఎస్ నాయకుల వినతి



సీపీ కార్యాలయం ఎదుట వినతి పత్రాన్ని చూపిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

చెన్నూర్ టౌన్, అక్టోబర్ 16 : చెన్నూర్ పట్టణంలోని శనిగకుంట పేల్చివేత ఘటనలో నిందితులను అరెస్ట్ చేయాలని బీఆర్ఎస్ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు బీఆర్ఎస్ తరపున మంచిర్యాల కలెక్టర్ కుమార్‌దీపక్, రామగుండం పోలీస్ కమిషనర్ శ్రీనివాస్‌కు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ నాయకుడు రాజారమేశ్ మాట్లాడుతూ ఈ ఘటనలో ఎమ్మెల్యే షాడో ఉన్నా, మరే నాయకులు ఉన్నా ఉపేక్షించేది లేదని, నిందితులను అరెస్ట్ చేసేవరకూ పోరాడుతూనే ఉంటామన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకుడు రాజారమేశ్‌తో పాటు మున్సిపల్ వైస్ చైర్మన్ నవాజొద్దీన్, కౌన్సిలర్ దోమకొండ అనిల్, మాజీ సర్పంచ్ సాధనబోయిన కృష్ణ, నాయకులు నయాబ్, తదితరులు పాల్గొన్నారు.